# ఆశ్చర్య చకితులను చేసి.. ఆత్మీయంగా పలకరించి..



ఆప్యాయంగా పలుకరిస్తూ..

సిటీబ్యూరో, నవంబర్ 18 ( నమస్తే తెలంగాణ ) : పాతబస్తీలో మంత్రి కేటీఆర్ సందడి చేశారు. శుక్రవారం ప్రచారం ముగిశాక రాత్రి 11 గంటలకు ఆయన మదీనా చౌరస్తాలోని శాదాబ్ రెస్టారెంట్‌కు వెళ్లారు. అక్కడి ప్రజలతో ముచ్చటించి.. వారితో కలిసి బిర్యానీ తిన్నారు. మొదట కేటీఆర్‌ను చూసిన అక్కడి వారంతా ఒక్కసారిగా దగ్గరకు వచ్చి కరచాలనం చేస్తూ సెల్ఫీలు దిగారు. 'మీరు ఇలా సింపుల్‌గా వస్తారని అనుకోలేదం'టూ కేటీఆర్‌తో చెప్పారు. ఎలాంటి ప్రోటోకాల్ లేకుండా రెస్టారెంట్‌కు వెళ్లడంతో అక్కడంతా పండుగ వాతావరణం ఏర్పడింది. నగర ప్రగతి, ప్రస్తుత ఎన్నికల సందర్భంగా ఉన్న పరిస్థితులపై తమ అభిప్రాయాలను ఆహార ప్రియులు మంత్రితో పంచుకున్నారు. బీఆర్ఎస్ రావాలని బలమైన ఆకాంక్షను వినిపించారు. కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారంటూ.. వారంతా ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి కేటీఆర్ మోజంజాహి మార్కెట్ వద్ద స్థానికులతో కలిసి ఐస్‌క్రీమ్ రుచి చూశారు. అక్కడ ఉన్న పలువురితో మాట్లాడారు. యువనేతతో సెల్ఫీలు దిగుతూ.. జనం సంబరపడ్డారు. జై కేసీఆర్.. జై కేటీఆర్ అంటూ నినదించారు. బీఆర్ఎస్‌లోనే తామంతా ఎలాంటి మత ఘర్షణలు లేకుండా ధైర్యంగా ఉండగలుగుతున్నామన్నారు. ఉమ్మడి పాలనలో కర్ఫ్యూ లు, మత ఘర్షణలతో ఉలిక్కిపడేవాళ్లమని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ కేసీఆర్ సీఎం అయితేనే..హైదరాబాద్ శాంతిభద్రతలు బాగుంటాయని కేటీఆర్‌కు వివరించారు. తప్పకుండా మన ప్రభుత్వమే వస్తుందని మంత్రి కేటీఆర్ వారికి మాట ఇచ్చారు.



అభిప్రాయాలు పంచుకుంటూ..

# బీఆర్ఎస్‌ను ఆశీర్వదించండి..



నాంపల్లి రోడ్‌షోలో మంత్రి కేటీఆర్

గ్రేటర్‌లోని సికింద్రాబాద్, గోషామహల్, నాంపల్లి నియోజకవర్గాల్లో శనివారం మంత్రి కేటీఆర్ రోడ్ షో ఉత్సాహంగా సాగింది. ప్రతిపక్షాల తీరును మంత్రి కేటీఆర్ ఎండగడుతున్నప్పుడు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. జై కేసీఆర్ నినాదాలు మార్మోగాయి. అభివృద్ధి ఆగొద్దంటే.. బీఆర్ఎస్ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరినప్పుడు.. ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించింది.

## నగరంలో ఉత్సాహంగా సాగిన మంత్రి కేటీఆర్ రోడ్‌షో..



## నందకిశోర్ వ్యాస్‌ను గెలిపించుకుందాం

● రోడ్ షోలో మంత్రి కేటీఆర్

సిటీబ్యూరో: గోషామహల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్‌ను గెలిపిస్తే..గోషామహల్‌ను దత్తత తీసుకొని..గచ్చిబౌలి తరహాలో తీర్చిదిద్దుతానని మంత్రి కేటీఆర్ అన్నారు. ఛత్రి చౌరస్తాలో రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ 'కాంగ్రెస్ పార్టీ నాన్‌లోకల్ వ్యక్తిని ఇక్కడ బరిలో దింపింది. గోషామహల్‌లో కాంగ్రెస్ అభ్యర్థిని మీరెప్పుడైన చూశారా? నందకిశోర్ వ్యాస్ గోషామహల్ ప్రజల సమస్యలు తెలిసిన వ్యక్తి. కరోనా సమయంలో ట్రస్ట్ పేరుతో విశేష సేవలందించారు. మూసీ నదిని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతాం. గోదావరి నీటితో ప్రక్షాళన చేసీ.. జీవనదిగా మారుస్తాం. కాంగ్రెస్ పాలనలో భోలక్‌పూర్‌లో నీరు కలుషితమై అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. బీఆర్ఎస్ సర్కారు స్వచ్ఛమైన నీటిని సమృద్ధిగా అందిస్తున్నది' అని చెప్పారు.

**సీతాఫల్‌మండిలో కరెంట్ తీగలు పట్టుకో..**

సీతాఫల్‌మండి రోడ్‌షోలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ 24 గంటల కరెంట్ ఎక్కడ ఉందంటున్న రేవంత్‌రెడ్డి.. సీతాఫల్‌మండికి వచ్చి కరెంట్ తీగలు పట్టుకుంటే తెలుస్తుందని మండిపడ్డారు. కరెంట్ కావాల్నా, కాంగ్రెస్ కావాల్నా అనేది ప్రజలే తేల్చుకోవాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో మంచి నీరు, నిరంతర కరెంట్, పెట్టుబడులతో హైదరాబాద్ అద్భుతంగా తయారైందన్నారు.

## కోహ్లీ సెంచరీ కొట్టినట్టు..

రోడ్ షోలో మంత్రి కేటీఆర్

సిటీబ్యూరో, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : 'కోహ్లీ సెంచరీ కొట్టినట్టు బీఆర్ఎస్ సెంచరీ కొట్టాలంటే.. నాంపల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి సీహెచ్ ఆనంద్ గౌడ్ గెలవాలి. హైదరాబాద్ ప్రశాంతంగా ఉన్నది. అన్ని మతాలను, కులాలను సమానంగా చూసే ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్. తొమ్మిదిన్నరేండ్లలో ఒక్కరోజు కర్ఫ్యూలేదు' అని మంత్రి కేటీఆర్ అన్నారు. మల్లెపల్లి చౌరస్తాలో ఆయన రోడ్ షోలో మాట్లాడారు. 'బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరాయి. 24 గంటల కరెంట్, తాగు నీటి సమస్య లేకుండా చేశాం. కార్మికులకు మూడు పూటల తినే పరిస్థితి ఉంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉన్న ప్రశాంత నగరాన్ని కాపాడుకుందాం. పాతబస్తీ మెట్రోతో పాటు ఎయిర్‌పోర్టు వరకు మెట్రోను విస్తరిస్తాం. అదనంగా 400 కిలోమీటర్ల మేర మెట్రోను తీసుకొస్తాం'. అని చెప్పారు.

## సికింద్రాబాద్ దశ తిరిగింది

సిటీబ్యూరో: పద్మారావు వంటి నాయకుడు ఎమ్మెల్యేగా ఉండటం స్థానిక ప్రజల అదృష్టమని, సమస్య ఏదైనా ముందుండి కాపాడుకుంటారని మంత్రి కేటీఆర్ కొనియాడారు. సికింద్రాబాద్ నియోజకవర్గం దశ తిరిగిందని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సికింద్రాబాద్ నియోజకవర్గంలో రోడ్ షో నిర్వహించారు. అడ్డగుట్టలో ఆయన ప్రసంగించారు. పేరుకు పెద్ద నియోజకవర్గం అయినా... పజ్జన్న గెలిచేంత వరకు ఒక్క డిగ్రీ కాలేజీ లేదని, 2016లో తొలి డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయడంతో పాటు, రూ. 30కోట్లతో పక్కా భవనాలను నిర్మించిన ఘనత పద్మారావుకే దక్కిందన్నారు. రూ. 72 కోట్లతో తుకారాం గేట్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణం, రూ. 12కోట్లతో సీతాఫల్‌మండిలో హాస్పిటల్ ఆధునీకరణ, మాణికేశ్వర్‌నగర్‌లో మరో వంద పడకల హాస్పిటల్, రూ. 13కోట్లతో అడ్డగుట్టలో మరో హాస్పిటల్, లాలాపేట్‌లో వైద్యశాలలను నిర్మించుకుంటున్నామన్నారు. సీతాఫల్ మండిలో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌తోపాటు లాలాపేట్, అడ్డగుట్టలోనూ ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. మారేడ్‌పల్లి, శాంతినగర్, తార్నాకలో మంచినీళ్ల ట్యాంకుల నిర్మాణం, లాలాపేట్ కల్వర్ట్, అంబర్‌పేట్ నాలాల ఆధునీకరణ చేసుకున్నామన్నారు. మూడేండ్లలో రూ.450 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో నగరం శాంతియుతంగా ఉందని, ఎక్కడి నుంచి వచ్చినా తెలంగాణ బిడ్డలుగానే చూసుకుంటున్నామని తెలిపారు. అల్లర్లు, అలజడులు లేకుండా అభివృద్ధి, సంక్షేమం, సౌలతులను మెరుగుపరుచుకునేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. 250 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరణ ఉంటుందన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో అన్ని డివిజన్లకు మెట్రో విస్తరణ, డ్రైనేజీ, వరద ముంపు సమస్యను పరిష్కరించుకోవాలన్నారు.

## అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ను గెలిపించండి

● నాంపల్లి అభ్యర్థి ఆనంద్‌కుమార్ గౌడ్

సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలను అందించారు. అభివృద్ధి కొనసాగాలంటే.. బీఆర్ఎస్‌ను గెలిపించాలి. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో కరెంట్ కోతలు లేవు. నీటి కష్టాలు పోయాయి. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయి. శాంతిభద్రతల సమస్య తొలగిపోయింది. ప్రశాంత వాతావరణంలో నగర ప్రజలు జీవిస్తున్నారు. మత సామరస్యం వెల్లివిరుస్తున్నది. సీఎం కేసీఆర్ వల్లే ఇవన్నీ సాధ్యమయ్యాయి. కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంను చేయాలి. ఇందు కోసం నాంపల్లిలో బీఆర్ఎస్‌ను గెలిపించాలి.